క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే కాసు



గురజాల: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని గురజాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన యెనుముల మురళీధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు నాగేశ్వరరావుకు పరామర్శ

పిడుగురాళ్ల: వైఎస్సార్ సీపీ వడ్డెర యూత్ నాయకులు తురకా నాగేశ్వరరావును పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మాదాల కిరణ్‌కుమార్, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ జబీర్, పట్టణ అధ్యక్షులు సుధీర్, బీసీ విభాగం పట్టణ అధ్యక్షులు కందులూరి శివయ్య, కొండలు, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

జల జీవన్ మిషన్ కింద నిధులు విడుదల

రెంటచింతల: తాగునీటి సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ కింద రూ.1200 కోట్ల నిధులు కేటాయించినట్లు బీజేపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మడి నాసరయ్య బుధవారం పేర్కొన్నారు. ఈ నిధులు మాచర్ల నియోజక వర్గంలోని మండలాలు, గ్రామాలలో నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాచర్ల నియోజక వర్గానికి ఐదు పదవులు కేటాయించినట్లు చెప్పారు. అందులో ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి ఆంజనేయులు(కారంపూడి), ఉపాధ్యక్షుడుగా బ్రహ్మయ్య(వెల్దుర్తి), కార్యదర్శులు పుల్లారెడ్డి, రెంటచింతల, ఆదిలక్ష్మి(మాచర్ల)లు కేటాయించటంతో పార్టీ అభివృద్ధి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీను, మట్టారెడ్డి, వరప్రసాద్, రాజశేఖరరెడ్డి తదితరులున్నారు.

అనాథ చిన్నారులకు చేయూత

మాచర్ల: చిన్నారులకు స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చేయూత నిచ్చింది. వివరాలు.. పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన దగ్గుల లక్ష్మీ కార్తీక రెడ్డి(12), అఖిల్ రెడ్డి(10) తల్లిదండ్రులు మృతి చెందారు. ట్రస్ట్ గోవిందరెడ్డి స్పందించి ఆ చిన్నారుల చదువు పూర్తయ్యేంతవరకు బాధ్యత తీసుకుంటున్నానని హామీ ఇచ్చారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో మాసశివరాత్రి వేడుకలు బుధవారం కనుల పండువగా నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో మాసశివరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో శాకంబరి దేవిగా అమ్మవారిని అలంకరించారు. గుండ్లపల్లి, నర్సింగపాడు గ్రామాల నుంచి మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించారు. పలు గ్రామాల భక్తులు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. దీపార్చనలు చేసి పొంగళ్లు పొంగించారు. విశేష అలంకరణలో స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

రైతులకు నాణ్యమైన ఎరువులను విక్రయించాలి

ఏడీఏ మస్తానమ్మ



బెల్లంకొండ: దుకాణదారులు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని క్రోసూరు డివిజన్ ఏడీఏ మస్తానమ్మ సూచించారు. బుధవారం మండలంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి అరుణ కుమారితో కలిసి తనిఖీ చేశారు. నాణ్యతలేని విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత పురుగుమందుల విక్రయం నేరమని పేర్కొన్నారు. గ్రోమోర్ దుకాణంలో ఎరువుల నిల్వలు తనిఖీ చేశారు. ఫారమ్ ఓ ఇంక్లూషన్ లేని రూ.27,61,413 విలువ గల 18,259 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలను నిలిపివేశారు. తదుపరి అనుమతులు వచ్చే వరకు ఆ ఎరువులను విక్రయించవద్దని సూచించారు.

అందని రుణాలు.. వర్తించని పథకాలు

- లక్ష్య దూరంగా కౌలు కార్డుల జారీ
- ఇబ్బందులు పడుతున్న కౌలు రైతులు



పత్తి చేలో అంతరకృషి చేస్తున్న కౌలు రైతు

అమరావతి: కౌలు రైతులకు అటు పంట రుణాలు, ఇటు ప్రభుత్వ పథకాలు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. పంట సాగుదారు హక్కు పత్రాలు జారీలో ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అలాగే కౌలు రైతులు కూడా పెద్దగా ఆసక్తి చూపటం లేదు. దీంతో కౌలు కార్డుల జారీ ప్రక్రియ నత్తనడకన సాగుతుంది.

నియోజవర్గంలో ఇలా...

పెదకూరపాడు నియోజవర్గంలోని ఐదు మంలాల్లో సీసీఆర్‌సీ కార్డుల జారీ ప్రస్తుతానికి లక్ష్య దూరంగా సాగుతుంది. నియోజకవర్గంలో మండలాల్లో సుమారు 11,179 సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేయాలనేది లక్ష్యంగా పెట్టుకుని మే నెల నుంచి రెవెన్యూ, వ్యవసాయ శాఖలు పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో నియోజకవర్గంలో 11,179 కార్డులకు గాను ఇప్పటివరకు సుమారు 2,036 కార్డులు మాత్రమే పంపిణీ చేసినట్లు సమచారం. అదే విధంగా మండలాల వారీగా అమరావతి మండలంలో 2,400 కార్డుల లక్ష్యం కాగా 701 కార్డులు పంపిణీ చేశారు. అలాగే పెదకూరపాడు మండలంలో 2,200కు గాను 268, క్రోసూరు మండలంలో 2,434కు గాను 270, అచ్చంపేట మండలంలో 2,800కు గాను 552, బెల్లంకొండ మండలంలో 1,345 కార్డుల లక్ష్యం కాగా 245 జారీ చేశారు. ఇప్పటికైనా రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు మండలంలోని భూ యజమానులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించి కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేసి తద్వారా పంట రుణాలు, వివిధ ప్రభుత్వ పథకాలు కౌలు రైతులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

గ్రూపులోన్లు ఇచ్చినా అప్పు తప్పదు



వ్యవసాయ ఖర్చులు పెరిగిపోవటంతో రైతులకు ప్రైవేటు అప్పులు తీసుకోవటం అలవాటైంది. పోయినేడు తెగుళ్లు ఎక్కువగా ఆశించటం, గిట్టుబాటు ధర లేకపోవటం వల్ల నష్టాలు వచ్చాయి. ఈ ఏడాదైనా కౌలు రైతులకు పంట రుణాలిస్తారేమోనని ఆశగా ఎదురుచూస్తున్నాం. గతంలోలాగా గ్రూపులోన్లు ఇచ్చినా పెట్టుబడికి సరిపోక మరలా పెచ్చు వడ్డీకి అప్పులు తేక తప్పదు.

– జెట్టి నాగరాజు, కౌలు రైతు, జూపూడి

రుణాలు ఇవ్వటం లేదు



ఈ ఏడాది కూడా 7 ఎకరాలు తీసుకుని అందులో 4 ఎకరాలు పత్తి వేశాను. మరో 3 ఎకరాలలో మిర్చి సాగు చేద్దామనుకుంటున్నాను. ఈ ఏడాది కూడా కౌలు రైతు కార్డు కోసం 20 రోజుల క్రితం అప్లికేషన్ పెట్టాను. గతేడాది పత్తి, మిర్చిలో నష్టాలు వచ్చి చేసిన అప్పులు తీరలేదు. కౌలు రైతులకు బ్యాంకులలో రుణాలు ఇవ్వటం లేదు. ఇక ఎక్కువ వడ్డీకి అప్పులు తెచ్చి సాగు చేయాల్సిందే. కౌలు రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది.

– కోరంపల్లి సూరిబాబు, కౌలురైతు, ధరణికోట

ప్రయత్నం చేస్తున్నాం

మండలంలో అన్ని బ్యాంకుల మేనేజర్లతో సంప్రదింపులు జరిపి కౌలు రైతులకు రుణాలిప్పించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. గతేడాది జాయింట్ లయబిలిటీ గ్రూపులకు, రైతు మిత్ర గ్రూపులలో కౌలు రైతులకు రూ.75 లక్షల రుణాలను ఇప్పించాం. ఈ ఏడాది కూడా బ్యాంకుల విధివిధానాలకు లోబడి కౌలు రైతులకు రుణాలిప్పిచ్చేందుకు కృషి చేస్తాం. కౌలు రైతులకు పంట సాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేస్తున్నాం.

– ఎస్‌కేఎఫ్ అహ్మద్, ఏవో, అమరావతి

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు



మాట్లాడుతున్న జగ్గారావు

నరసరావుపేట రూరల్: రైతులు రసాయనాలు వీడి, ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగ్గారావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ వీడి పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి మాట్లాడుతూ పత్తి పంటను సాగు చేస్తున్న రైతులు తమ పొలంలో ఎకరానికి 500 కేజీలు చల్లాలని, విత్తనాల రక్షణ కోసం బీజామృతంలో విత్తనశుద్ధి చేసి నాటడం వలన తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడవచ్చని తెలిపారు. వరి, మిరప సాగు చేసే రైతులు 30 రకాల విత్తనాలతో పీఎండీఎస్ సాగు చేసి 45 రోజుల తరువాత కలయ దున్నడం వల్ల భూమికి కావల్సిన జీవవైవిధ్యం పెరిగి ప్రధాన పంటకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెంది పంట ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. ఆరు డివిజన్‌లో 530 గ్రామాల్లో 46,600 రైతులతో 82,823 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ విధానాలతో కొన సాగింపే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని తెలిపారు. జిల్లా ఎన్ఎఫ్ఏలు సైదయ్య, నందకుమార్, సౌజన్య, అప్పలరాజు, మేరీ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్



సూచనలు చేస్తున్న నాగేశ్వరనాయక్

శావల్యాపురం: పరిసరాల పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎస్.వి.నాగేశ్వరనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని బొందిలిపాలెం, శావల్యాపురం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను సందర్శించి శానిటేషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ప్రజలకు వస్తున్న ఐవీఆర్ కాల్స్ ఆధారంగా చెత్త సంపద కేంద్రం పనితీరు క్లాప్‌మిత్రలు సేకరించుతున్న తడి,పొడి చెత్తను రిక్షాలు వినియోగాన్ని తదితరవన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా శావల్యాపురం గ్రామంలో నలుగురు క్లాప్‌మిత్రలు చేయాల్సి పనులను ఇద్దరు మాత్రమే పనులు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే బొందిలిపాలెం గ్రామంలో చెత్త సంపద కేంద్రం పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు ఉండగా 256 గ్రామ పంచాయతీల నుంచి ఐవీఆర్ కాల్స్ నమోదు అవుతున్నాయన్నారు. శావల్యాపురం గ్రామపంచాయతీకి స్వచ్ఛ కార్పొరేషన్ ద్వారా చెత్తా తరలించేందుకు ప్రత్యేకంగా ట్రాక్టరు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి బోడ్డు యాకోబు, క్లాప్‌మిత్రలు ఉన్నారు.

కొండవీడులో ఉపాధ్యాయులకు సత్కారం



హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల్ని సత్కరిస్తున్న దృశ్యం

కొండవీడు(యడ్లపాడు): విద్యతో పాటు పాఠశాల అభివృద్ధికి ఎనిమిదేళ్లపాటు సేవలు అందించి మరో పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల్ని కొండవీడు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మండలంలోని కొండవీడులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసిన గోరంట్ల శ్రీనివాసరావు, సహోపాధ్యాయులతో కలిసి విద్య, క్రీడా, పారిశుధ్య, వివిధ రంగాల్లో నైపుణ్యలను పెంపొందిస్తూ విద్యార్థులకు ఎంతగానో ప్రోత్సాహాన్ని అందించారు. గ్రామస్తులు, ఉన్నతాధికారుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేశారు. దీంతో అనేక గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు అనేక పతకాలు సాధించారు. పీఎంశ్రీ కింద ఎంపికై, ఈ విద్యాసంవత్సరం నుంచి జడ్పీ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ కూడా అయింది. దీంతో గ్రామస్తులు, బదిలీపై ఈ పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు సమిష్టిగా హెచ్‌ఎం శ్రీనివాసరావుతో పాటు ఇదే పాఠశాలలో తెలుగు, పండిట్‌లుగా పని చేసిన జి.నరేంద్రకుమార్, జె.కవిత, ఎస్జీటీ ఇంకా సమతను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం ఎ.మాధవి, గ్రామస్తులు వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ రసూల్, వైస్‌చైర్మన్ వై కృష్ణవేణి, ఉపాధ్యాయులు బీఎస్ఎల్ రాజు, ఆంజనేయులు, సుందరమ్మ, జున్నుసాహెబ్, ఎంపీపీఎస్ హెచ్‌ఎం సత్యనారాయణమూర్తి గ్రామపెద్దలు పెద్దన్న, వైవెంకట్రావు, మొహమ్మద్ హుస్సేన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్ణీత వేళల్లో దుకాణాలు తెరచి ఉంచాలి

యడ్లపాడు: మండలంలోని 39 రేషన్‌షాపుల డీలర్లు ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ విధిగా తెరిచి ఉంచి కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. యడ్లపాడు రెవెన్యూ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మండల రేషన్ డీలర్లతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయశ్రీ మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు డీలర్లు చౌకదుకాణాలను తప్పనిసరిగా తెరిచి ఉంచాలన్నారు. కార్డుదారులకు నిర్ణీత పనివేళల్లో సరుకులు పంపిణీ చేయాలని, ప్రధానంగా 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్ల వద్దకు డీలర్లే వెళ్లి రేషన్ సరుకులు అందించాలన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 26 నుంచి 31వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రతినెలా 1 నుండి 15వ తేదీ వరకు షాపుల వద్ద సరుకుల పంపిణీ చేయాలని, తూకాల్లో అవకతవకలు లేకుండా సరుకుల్ని పంపిణీ చేయాలన్నారు. ప్రజల నుంచి రేషన్ పంపిణీపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం రేషన్ డీలర్ల సమస్యల్ని అడగ్గా సర్వర్ల సమస్య ఉందని తెలిపారు. త్వరలోనే వాటిని ఉన్నతాధికారుల ద్వారా పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, ఆర్ఐ సుబ్బారావు, వీఆర్వోలు, మండల రేషన్‌షాపుల అధ్యక్షులు గుత్తా శ్రీరామమూర్తి, కార్యదర్శి గల్లా కోటేశ్వరరావు, డీలర్లు, పాల్గొన్నారు.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మాస శివరాత్రి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభేశ్వరునికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట

సత్తెనపల్లి: టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగిన సంఘటన పట్టణంలోని 24వ వార్డులో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం పట్టణంలోని 24వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరు కావడానికి ముందు 24వ వార్డులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద వివాదం నెలకొంది. ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతూ స్థానిక నాయకుల ఫొటోలతో ఫ్లెక్సీ పెట్టగా మొదటి లైన్‌లో ఫొటోలు ఉన్న నేతలను ఉద్దేశించి టీడీపీ పట్టణ ట్రెజరర్ దేవతి శివప్రసాద్ వివాదాస్పద కామెంట్స్ చేశాడు. దీంతో అక్కడే ఉన్న ప్రభుత్వ ఏరియా వైద్యశాల డైరెక్టర్ మారెళ్ళ స్వామి స్పందించాడు. ఏమిటి నువ్వు చేసే కామెంట్ అంటూ ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారితీసింది. దీంతో టీడీపీ నాయకులు అప్రమత్తమై ఇరువురినీ విడ దీశారు. కొద్దిసేపటికి ఎమ్మెల్యే రావడంతో కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ తోపులాట పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

డ్రగ్స్‌కు బానిసలైతే జీవితాలు ఛిన్నాభిన్నం

ఎస్ఐ చల్లా సురేష్

నకరికల్లు: మాదకద్రవ్యాల వలన జీవితాలు ఛిన్నాభిన్నమవుతాయని ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు. మాదకద్రవ్యాల వలన కలిగే అనర్థాలను వివరిస్తూ స్థానిక అక్షర పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం లాంటి మాదకద్రవ్యాల వలన శారీరక, మానసిక రుగ్మతలు ఏర్పడతాయన్నారు. జీవితంలో విషాదం నింపే డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. యుక్త వయస్సులో దురలవాట్లకు బానిసలు కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పాఠశాల బస్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనాలు నడిపే క్రమంలో క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిరోజూ పర్యవేక్షణ ఉంటుంది

బొల్లాపల్లి: చెత్త సేకరణ, పారిశుధ్యం మెరుగుదలలో రాష్ట్రంలోనే జిల్లా నాల్గో స్థానంలో ఉందని నరసరావుపేట డివిజనల్ పంచాయతీ అధికారి వీవీఎం లక్ష్మణరావు తెలిపారు. బుధవారం మండలంలోని రేమిడిచర్ల గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలో మహిళల నుంచి చెత్త సేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో తిరిగి పారిశుధ్యం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీ ఓ మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో 207 పంచాయతీలు ఉన్నాయని, వీటిలో పంచాయతీ సిబ్బంది, అధికారులు ప్రతిరోజు పర్యవేక్షణ ఉంటుందన్నారు. గ్రామాల్లో ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా చెత్త సేకరణ పై సమాచారం సేకరిస్తున్నట్లు తెలిపారు.

మైదవోలు తరహాలోనే మరో ఇంట్లో చోరీ

యడ్లపాడు: తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని దుండగుడు మరోసారి చోరీ చేసిన సంఘటన మండలంలోని సొలస గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సొలస గ్రామానికి కిలారు వెంకటేశ్వరరావు, హనుమాయమ్మ దంపతులు తమ మనవడిని చూసేందుకు ఈనెల ఐదో తేదీన హైదరాబాదుకు వెళ్లారు. తాళం వేసిన ఇంటికి బుధవారం తలుపులు తెరిచి ఉండటం పక్కింటి వారు గమనించారు. అదేగ్రామంలో మరో వీధిలో నివాసం ఉంటున్న వారి కుమార్తె ఈదర అరుణకుమారికి ఈ విషయాన్ని తెలియజేశారు. దీంతో ఆమె వెంటనే తల్లిదండ్రుల నివాసానికి వచ్చి చూడగా.. ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి, బీరువాలు తెరుచుకొని ఉండడం, ఇల్లంతా వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించింది. బీరువాలో దాచిన రూ.56 వేల నగదు, 200 గ్రాముల వెండి ఆస్తి చోరీ అయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ టి శివరామకృష్ణ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని చేరుకుని, ఇంటి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. క్లూస్‌టీం రప్పించి ఆధారాలు సేకరించారు. ఈనెల 19వ తేదీన మైదవోలు గ్రామంలో బండారు వరలక్ష్మి ఇంట్లో జరిగిన చోరీ తరహాలోనే ఉండటంతో అక్కడ, ఇక్కడ ఒకరే చోరీకి పాల్పడి ఉండోచ్చని పోలీసులు భావిస్తున్నారు.

రామప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు



రామప్పదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

మాచర్ల రూరల్: మాసశివరాత్రిని పురస్కరించుకొని రామప్ప దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాసశివరాత్రి ఆరుద్ర నక్షత్రం ఒకే రోజు రావటంతో దేవాలయంలో పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి కుంకుమ పూజ చేసి వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించి శాకంబరి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం గణపతి, లక్ష్మీపార్వతి, పరమేశ్వర, గాయత్రి, లక్ష్మీనారాయణ, రుద్ర, సరస్వతి, బ్రహ్మదేవుడు, మృత్యుంజయ, నవగ్రహాల హోమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు భువనగిరి రామశర్మ నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంభంపాటి యలమంద, తుమ్మెపల్లి సత్యనారాయణ, తుమ్మెపల్లి అంకేశ్వరరావు, మంజుల, వెంకట రత్నం, చెన్నకేశవరావు, సాంబశివరావు, మంగమ్మ, పద్మావతి, ప్రకాష్, అరుణ, చిన్ని, నాగలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి పాపకుమారి

మాచర్ల: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.పాప కుమారి రైతులతో కలిసి పత్తి పంట పొలాలను సందర్శించారు. పత్తి పంటల సాగులో గులాబి రంగు పురుగు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. వివిధ పంటలను సాగు చేస్తున్న రైతులు పంటల బీమా చేసుకోవాలని సూచించారు. కౌలు రైతులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి సీసీఆర్సీ కార్డులను పొందాలని కోరారు. కొత్తపల్లి గ్రామంలో కంది మినికిట్ ఎల్ఆర్‌జీ -52 రకం విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో మాచర్ల వ్యవసాయ విస్తరణ అధికారి ఎం.మార్కండేయులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది ఎ.ప్రతాప్, బి.అంజి నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఓ సంధ్యారాణి

పిడుగురాళ్ల మండలంలో...

పిడుగురాళ్లరూరల్ : మండలంలోని జూలకల్లు, పందిటివారిపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ సంధ్యారాణి మాట్లాడుతూ... రైతులందరూ కేఎన్ఎం-1638 అనే వరి రకం 120 నుంచి 125 రోజుల పంట, ఒక ఎకరానికి 45 నుంచి 50 బస్తాలు అవుతుందని, తక్కువ కాలం పరిమితి గల పంటలను సాగు చేసుకోవాలన్నారు. ఈ రకం బీపీటీ 5204 కంటే మంచి రకం కేఎన్ఎం 1638 అనే రకం అగ్గితెగులను తట్టుకుంటుందని, మానుగాయ రాదని, గాలులకు పడిపోదని సన్న రకాలను మాత్రమే సాగు చేసుకుంటే మార్కెట్‌లో కూడా బాగా డిమాండ్ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు స్వరూప, వంశీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన కేంద్రీయ విద్యార్థినులు



విద్యార్థినులు, పీఈటీ కిరణ్‌రెడ్డిని అభినందించిన ప్రిన్సిపాల్ జగదీశ్‌కుమార్ గుప్తా

సత్తెనపల్లి: పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో జరిగిన 54వ జాతీయ స్థాయి వాలీబాల్ అండర్-17 బాలికల పోటీలలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ విద్యార్థినులు రన్నర్ అప్‌గా నిలిచారు. హైదరాబాద్‌లో జరిగిన సెలక్షన్ క్యాంప్‌లో సత్తెనపల్లి పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం నుంచి స్వీటీబాయ్, ఎస్.శ్రీలక్ష్మి, బి.సరోజిని, జెస్సీ ఇషిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు జరిగిన ట్రైనింగ్ క్యాంప్‌లో వీరు మెళకువలు నేర్చుకుని ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరిగిన 54వ జాతీయ స్థాయి పోటీలలో రన్నర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పీఈటీ బి.కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగిన రీజనల్ వాలీబాల్ మీట్‌లో సత్తెనపల్లి జట్టు రన్నర్‌గా నిలిచిందన్నారు. ప్రిన్సిపాల్ జగదీశ్ కుమార్ గుప్తా విద్యార్థినుల అభివృద్ధికి కృషి చేసిన పీఈటీ కిరణ్ రెడ్డిని అభినందించారు. ఖమ్మంలో జరిగిన ట్రైనింగ్ క్యాంపుకి కిరణ్ రెడ్డి శిక్షణ నిపుణులుగా వెళ్లడం ఎంతో గర్వకారణమన్నారు. జాతీయ స్థాయిలో రన్నర్ అప్‌గా నిలిచిన సతెనపల్లి విద్యార్థినులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

చిన్నారుల వ్యాక్సినేషన్‌కు కార్యాచరణ

జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి గీతాంజలి



మాట్లాడుతున్న బి.గీతాంజలి

బొల్లాపల్లి: చిన్నారులకు మూడు నెలల పాటు వ్యాక్సినేషన్‌కు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బి.గీతాంజలి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. స్థానికంగా వ్యాక్సిన్ సెంటర్‌ను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా డీఐఓ మాట్లా డుతూ మే, జూన్, జూలై నెల చివరి వారంలో వ్యాక్సిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని వెల్ల డించారు. ఐదు సంవత్సరాల్లో చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి గురుకుమార్, బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యులు బి.వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత అవసరం

నాదెండ్ల: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని, సంపాదనలో కొంత బ్యాంకుల్లో పొదుపు చేసుకోవాలనేది రిజర్వుబ్యాంకు ముఖ్య ఉద్దేశ్యమని సాతులూరు కెనరాబ్యాంక్ చీఫ్ మేనేజర్ మారుతీశ్రీనివాసులు చెప్పారు. సాతులూరు సచివాలయంలో భారతీయ రిజర్వు బ్యాంక్, ల్యాంప్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు.
పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా ఎదగటం అనేది పొదుపు ద్వారా సాధ్యమౌతుందన్నారు. ప్రైవేటు సంస్థల ద్వారా తీసుకున్న అప్పులు ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతీస్తాయన్నారు. కార్యక్రమానికి ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌రాజు అధ్యక్షత వహించగా సాతులూరు గ్రామీణబ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ సర్పంచ్ ముసుగు శోభారాణి, వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్ పద్మ, ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వరరావు, బాజి, మంగయ్య, పంచాయతీ కార్యదర్శి రాఘవయ్య, యానిమేటర్లు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం

నరసరావుపేట రూరల్: విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను విలువలను పెంపొందించే గొప్ప వేదిక ఎన్‌సీసీ అని నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బీ సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, 23వ ఆంధ్ర బెటాలియన్ ట్రైనింగ్ సుబేదార్ మహమ్మద్ సబూర్, కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్ బాబులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com